మురుగు.. కనుమరుగు



- 50, 51, 53 వార్డుల్లో గెడ్డల ఆధునికీకరణ
- చురుగ్గా రక్షణ గోడల నిర్మాణం
- నివాసితుల హర్షం

నాడు: గెడ్డలు శిథిలావస్థలో ఉండేవి. చిన్న వాన పడినా రోడ్లపైకి మురుగు ప్రవహించేది. రక్షణ గోడల్లేక క్రిములు, విషపురుగులు ఇళ్లలో చేరడంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇబ్బంది పడేవారు.

నేడు: వార్డుల్లో మౌలిక వసతులపై ప్రధానంగా దృష్టి సారించిన ప్రభుత్వం కోట్ల రూపాయల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టింది. ప్రజలకు మురుగు సమస్య లేకుండా గెడ్డలకు రక్షణ గోడలు నిర్మించింది. దీంతో ఎంత వాన పడినా నీరు ఆగకుండా ప్రవహిస్తోంది. సమీప ప్రాంతాల ప్రజలు నిశ్చింతగా జీవిస్తున్నారు.

50వ వార్డు
వంశీనగర్
రూ.25 లక్షలు

51వ వార్డు
చిట్టిబాబు కాలనీ
రూ.38లక్షలు

51వ వార్డు
అంబేడ్కర్ కాలనీ
రూ.29.60లక్షలు

53వ వార్డు
జాకీర్ హుస్సేన్ గెడ్డ
రూ.35లక్షలు

53వ వార్డు
నరేంద్రనగర్ గెడ్డ
రూ.20 లక్షలు


51వ వార్డు చిట్టిబాబు కాలనీలో పూర్తయిన గెడ్డ నిర్మాణం

మర్రిపాలెం: వార్డుల్లో మౌలిక వసతులు కల్పించాలన్న ప్రభుత్వ ఆదేశాలతో అధికారులు అన్ని అంశాలపై దృష్టి సారించారు. వార్డుల్లో జనావాసాల మధ్య నుంచి వస్తున్న గెడ్డలకు జీవీఎంసీ అధికారులు రక్షణ గోడలు నిర్మించి, బాటమ్ కాంక్రీట్ నిర్మాణ పనులు శరవేగంగా పూర్తి చేశారు

వంశీనగర్ గెడ్డ సమస్య పరిష్కారం

వంశీనగర్‌లో గెడ్డ ఎంతో కాలంగా అభివృద్ధికి నోచుకోలేదు. గత టీడీపీ ప్రభుత్వంలో వినతి ఇస్తే కొంతమేర చేసి వదిలేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక దానికి మరమ్మతులు చేయించారు. బాటమ్ కాంక్రీట్, రక్షణ గోడలకు సంబంధించి రూ.25లక్షల వ్యయంతో నిర్మాణం పూర్తి చేశారు. ప్రస్తుతం ఈ గెడ్డలో నీటి ప్రవాహానికి ఇబ్బంది లేకుండా ఉంది.

51వ వార్డులో రెండు గెడ్డలకు మోక్షం

చిట్టిబాబు కాలనీ, అంబేడ్కర్ కాలనీల్లో గెడ్డలకు రక్షణగోడలు లేకపోవడంతో విష పురుగులు, పాములు వంటివి ఇంట్లోకి వచ్చేవి. వర్షం పడిందంటే దోమలు, ఈగలు కూడా ఎక్కువే. దీంతో అక్కడ ప్రాంత ప్రజలు తరచూ అనారోగ్యం బారిన పడేవారు. పిల్లలు, పెద్దలు అందులో పడిపోతారేమో అనే దిగులు ఉండేది. ఇప్పుడు రెండు గెడ్డల నిర్మాణం పూర్తయింది. చిట్టిబాబు కాలనీకి రూ.38లక్షలు, అంబేడ్కర్ కాలనీకి రూ.29.60లక్షల వ్యయంతో జీవీఎంసీ అధికారులు పనులు పూర్తి చేశారు. ఇప్పుడు రక్షణ గోడలు నిర్మించి, బాటమ్ కాంక్రీట్ వేయడంతో వారి అవస్థలు తొలగాయి.

40ఏళ్ల సమస్యకు పరిష్కారం

53వ వార్డులో నరేంద్రనగర్, జాకీర్ హుస్సేన్ నగర్ గెడ్డలకు సంబంధించి పనులు పూర్తయ్యాయి. జాతీయ రహదారి సర్వీసు రోడ్డులో పక్కనే ఉన్న జాకీర్ హుస్సేన్ గెడ్డ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. కాలనీ వాసులకు 40 ఏళ్ల పైబడి ఈ గెడ్డ పెద్ద సమస్యగా ఉండేది. రక్షణ గోడ లేక ప్రాణాలకు రక్షణ ఉండేది కాదు. ఇప్పుడు జాకీర్ హుస్సేన్ గెడ్డకు సంబంధించి రూ.35లక్షలతో బాటమ్ కాంక్రీట్, సైడ్ వాల్స్ నిర్మించి జీవీఎంసీ పని పూర్తి చేసింది. నరేంద్రనగర్ గెడ్డకు సంబంధించి గడపగడపకు మన ప్రభుత్వం నిధుల ద్వారా రూ.20 లక్షలతో బాటమ్ కాంక్రీట్ వేసి పనులు పూర్తి చేశారు.

ఎన్నో ఏళ్ల సమస్య పరిష్కరించారు



1986 నుంచి వంశీనగర్ గెడ్డను ఎవరూ పట్టించుకోలేదు. టీడీపీ హయాంలో చెప్పాం. ఏదో కొంత చేసి వదిలేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక సమస్యలన్నీ పరిష్కరిస్తుండటంతో నాయకుల దృష్టికి తీసుకువెళ్లాం. వెంటనే స్పందించారు. గెడ్డకు బాటమ్ కాంక్రీట్ వేసి, రక్షణ గోడ నిర్మించి పనులు పూర్తి చేశారు.

– సన్యాసిరావు, వంశీనగర్, 50వ వార్డు

రక్షణ గోడ నిర్మాణంతో నిశ్చింత




మా కాలనీలో ఇళ్ల మధ్య గెడ్డ ఉండటంతో వర్షం వచ్చినప్పుడల్లా చాలా ఇబ్బంది పడేవాళ్లం. మురుగు ఇళ్లలోకి వచ్చేసేది. విషపురుగులు, ఈగలు, దోమలు కంటిపై కునుకు ఉండేది కాదు. వర్షం నీరు, మురుగు కలిసిపోయి రోడ్లన్నీ అధ్వానంగా ఉండేవి. అడుగు వేయాలంటే భయం. ఇప్పుడు గెడ్డకు రక్షణగోడ కట్టాక సమస్య పరిష్కారమైంది. గతంలో పిల్లలు అటు వైపు వెళ్తే పడిపోయేవాళ్లం. ఇప్పుడు నిశ్చింతగా ఉంటున్నాం.

– శంకరరావు, అంబేడ్కర్ కాలనీ, 51వ వార్డు


53వ వార్డు నరేంద్రనగర్‌లో పూర్తయిన గెడ్డ నిర్మాణం


53వ వార్డు జాకీర్ హుస్సేన్ నగర్ లో గెడ్డ


50వ వార్డు వంశీనగర్‌లో గెడ్డకు బాటమ్ కాంక్రీట్ వేసి, గోడ నిర్మాణం

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' కార్యాలయంలో గ్రీవెన్స్

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు బాలయ్య శాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ కార్యాలయంలో మంగళవారం నెడ్‌క్యాప్ చైర్మన్, నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు ఆధ్వర్యంలో గ్రీవెన్స్ నిర్వహించారు. ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. పలు వినతులకు వెంటనే పరిష్కారం చూపారు. మరి కొన్నింటిని సంబంధిత అధికారులకు రిఫర్ చేసి, త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

లలితా పీఠంలో చండీ హోమం


లలితాపీఠంలో చండీ హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

సీతంపేట: స్థానిక లలితానగర్‌లోని లలిత పీఠంలో కార్తీక మాసం, బహుళ అష్టమి సందర్భంగా మంగళవారం ఉదయం చండీ హోమం నిర్వహించారు. పండితుల వేద మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా హోమం జరిపించారు. గణపతి పూజ, కలశ శుద్ధి, అగ్ని ప్రతిష్టాపన, గోపూజ, పరివార పూజ, సుహాసిని పూజ, దంపత పూజ, చండీ సప్తశతి చివరగా పూర్ణాహుతి నిర్వహించారు. లోకకల్యాణం, విశేష కార్యసిద్ధి కోసం జగన్మాతను ఆరాధించడంలో భాగంగా చండీ హోమం నిర్వహించినట్టు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. సాయంత్రం 1000 గారెలతో కాశీ కాలభైరవ హోమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు


సుబ్రహ్మణ్యేశ్వరుడికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకుడు రాజాస్వామి

సీతమ్మధార : జీవీఎంసీ 14వ వార్డులోని సీతమ్మధార, నార్త్ ఎక్స్‌టెన్సన్‌లో మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వరస్వామి, అయ్యప్ప, శ్రీషిర్డీ సాయిబాబా ఆలయంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ప్రధానార్చకుడు రాజాస్వామి ఆధ్వర్యంలో అర్చక బృందం ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకం, భక్తుల గోత్రనామాలతో విశేష పూజలు చేశారు.

ద్వారకా పోలీస్ స్టేషన్‌లో రికార్డుల పరిశీలన


ద్వారకా స్టేషన్‌లో పెండింగ్ కేసులు పరిశీలిస్తున్న ద్వారకా ఏసీపీ ఆర్.వి.ఎస్.ఎన్.మూర్తి

సీతమ్మధార : ద్వారకా పోలీస్‌స్టేషన్‌లో పాత కేసుల రికార్డులను ద్వారకా ఏసీపీ ఆర్.వి.ఎస్.ఎన్.మూర్తి పరిశీలించారు. మంగళవారం పోలీస్‌స్టేషన్‌ను ఆయన సందర్శించారు. పెండింగ్ కేసులతో పాటు ఇతర కేసులపై ఆరా తీశారు. పెండింగ్ కేసులను త్వరగా పూర్తి చేయాలని ఏసీపీ సూచించారు. రౌడీ షీటర్లకు సంబంధించి నడవడికపై ఆరా తీశారు. మిస్సింగ్ కేసులను అడిగి తెలుసుకున్నారు. సీడీ ఫైల్స్‌పై ప్రత్యేకంగా ఆరా తీసినట్లు తెలిసింది. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి సీఐ సోమశేఖర్, ఎస్‌ఐలు ధర్మేంద్ర, శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు.

వేడుకగా గౌరీ పరమేశ్వరుల ఉత్సవం

విశాఖ విద్య: ఎన్‌ఏడీ సెంటర్ దరి గవరవీధిలో గౌరీ పరమేశ్వరుల ఉత్సవం వేడుకగా సాగుతోంది. ప్రత్యేక వేదికపై ఏర్పాటు చేసిన అమ్మవారి మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం గౌరీమాత వద్ద మణిద్వీపం ఏర్పాటు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. గౌరీమాతను స్మరిస్తూ సామూహిక కీర్తనలు ఆలపించారు.

తెరిపివ్వని వరుణుడు


బురదమయమైన సత్యం రోడ్


అక్కయ్యపాలెం మంగళవీధిలో నిలిచిన నీరు


వర్షపు నీటితో జలమయమైన శంకరమఠం రోడ్

సీతంపేట: తుపాను ప్రభావంతో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి నగరం తడిసి ముద్దయింది. సోమవారం ఉదయం మొదలైన వర్షం మంగళవారం కూడా కొనసాగడంతో జనజీవనం చాలా వరకు ఇంటికే పరిమితమైంది. కాలు బయటపెట్టే వీలు లేకుండా రోజంతా వర్షం కురవడంతో జనం అవస్థల పాలయ్యారు. జోరువానతో జన సంచారల లేక రహదారులు బోసిపోయాయి. అత్యవసర పనులపై బయటకు వచ్చిన వారు గొడుగులు, రెయిన్‌కోట్లు ధరించి పనులు చక్కబెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వ్యాపారాలు సాగక చిరువ్యాపారులు, తోపుడు బళ్ళ వ్యాపారులు ఉసూరుమన్నారు. ముసురుతో బేరాలు లేక రోజు కూలీ కూడా కిట్టలేదని, పైగా తెచ్చిన సరుకు పాడైపోతోందని తోపుడుబళ్ళ వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం మధ్యాహ్నం తర్వాత ఏకదాటిగా కురిసిన వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. కాలువలు, గెడ్డల్లో వర్షపు నీరు పొంగిపొర్లి ప్రవహించాయి. శంకర మఠం రోడ్, మంగళవీధి, క్రౌన్ బేకరీ వద్ద, మధురానగర్ రోడ్ వర్షపు నీటితో నిండిపోయాయి.

వర్షంతో ప్రజల ఇక్కట్లు

సీతమ్మధార : తుపాను కారణంగా సీతమ్మధార మెయిన్ రోడ్డులోని ఆంధ్రా బ్యాంక్ బయట నీరు చేరిపోవడంతో రాకపోకలు ఇబ్బందికరంగా మారింది. తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో వర్షపు నీరు చేరింది. నక్కవానిపాలెం, బాలయ్య శాస్త్రి లేఅవుట్‌లోని ప్రధాన రహదారిలో మురుగు నీరు నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. వాహనదారులు, పాదచారులు ఇబ్బందులకు గురయ్యారు. రేసపువానిపాలెంలో కాలువలు మురుగునీటితో నిండిపోయాయి. కేఆర్‌ఎం కాలనీలో గోతుల్లో నీరు చేరడంతో వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట వర్షపు నీటిలో తోపుడుబళ్లు ఉండిపోయాయి.

వ్యక్తి అదృశ్యం




బూడి దాసు, వి.సావిత్రమ్మ

మర్రిపాలెం: వ్యక్తి అదృశ్యంపై ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో కేసు నమోదైంది. వివరాలివి.. పెందుర్తి జుత్తాడకు చెందిన మారెడుబూడి దాసు(38) మర్రిపాలెం రైల్వే లోకో షెడ్‌లో క్రేన్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నారు. గత నెల 30న దొండపర్తిలో ఉంటున్న తన సోదరి ఇంటికి భార్య సంధ్యారాణితో కలిసి వెళ్లారు. ఈ నెల 1న భార్యాభర్తలిద్దరూ చర్చికి వెళ్లారు. తాను ఏటీఎంకు వెళ్తున్నానని, ప్రార్థన ముగించాక ఫోన్ చేస్తే వచ్చి తీసుకువెళ్తానని భార్యకు ఫోన్‌లో చెప్పారు. ప్రార్థన అనంతరం భర్త దాసుకు ఫోన్ చేయగా ఫోన్ అందుబాటులో లేకపోవడంతో అంతా వెతికారు. అయినా, ఆచూకీ తెలియకపోవడంతో సోమవారం రాత్రి సంధ్యారాణి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ ఎస్.సాయి ఆధ్వర్యంలో ఉమెన్ హెడ్ కానిస్టేబుల్ కృష్ణకుమారి కేసు దర్యాప్తు చేపట్టారు.

ఇంటి నుంచి వెళ్లిపోయిన వృద్ధురాలు

మర్రిపాలెం: కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వృద్ధురాలు అదృశ్యమైన ఘటనపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలివి.. వి.సావిత్రమ్మ (85) తాటిచెట్లపాలెం రైల్వే క్వార్టర్స్‌లో కుమారుడి కుటుంబంతో కలిసి నివసిస్తున్నారు. గత అర్ధరాత్రి 12 గంటల తరువాత ఇంటి నుంచి బయటికి వచ్చిన ఆమె, తలుపు బయట గెడ పెట్టుకుని వెళ్లిపోయారు. దీనిపై ఆమె కుమారుడు హరికృష్ణ మంగళవారం కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆమెకు మతిస్థిమితం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. సీఐ ఎస్.సాయి నేతృత్వంలో ఏఎస్‌ఐ కనకరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఎవరైనా ఆమెను గుర్తిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

పలు ఐవీఎఫ్ సెంటర్ల తనిఖీ


వైద్యులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం నగరంలో గల పలు ఐఆర్‌టీ, ఐవీఎఫ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఆడమ్స్ ఐవీఎఫ్ కేంద్రంలో ఏఆర్‌టీ బ్యాంక్, పద్మశ్రీ ఐవీఎఫ్‌లో ఏఆర్‌టీ లెవల్-2, అనిల్ నీరుకొండ ఆస్పత్రిలో ఏఆర్‌టీ లెవెల్-1, గీతం ఆస్పత్రులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాలకు పలు సూచనలు చేశారు. ఆపరేషన్ థియేటర్, వార్డు, స్కానింగ్ మెషీన్లను తనిఖీ చేశారు. ఆస్పత్రులకు ఏఆర్‌టీ కేంద్రాల నిర్వహణకు అనుమతులు ఉన్నాయో లేదో, వైద్యులు, ఉద్యోగుల విద్యార్హతలను పరిశీలించారు. ల్యాబ్ పరికరాలను పరిశీలించి సలహాలు ఇచ్చారు. ఈ కేంద్రాల్లో పేదవారికి ఫీజు తగ్గించి తీసుకోవాలని కోరారు. ఈ తనిఖీ బృందంలో డాక్టర్ గీతా వందన, ఎల్.వి.రమణి, డాక్టర్ బి.ఉమావతి, బి.నాగేశ్వరరావు, కె.శివాజీ తదితరులు పాల్గొన్నారు.

యాచకుడి మృతి


మృతి చెందిన యాచకుడు

బీచ్ రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డులో ఓ యాచకుడు మంగళవారం మృతి చెందాడు. రెండు రోజులుగా పడుతున్న వర్షాల కారణంగా తినడానికి ఏమీ దొరకలేదు. ఉండడానికి కూడా సరైన స్థలం లేకపోవడంతో చలికి యాచకుడు మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న మూడో పట్టణ పోలీసులు జీవీఎంసీ సిబ్బంది సహకారంతో కేజీహెచ్ మార్చురీకి తరలించారు.

వైభవుని సన్నిధిలో రేపటి నుంచి పవిత్రోత్సవాలు



మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో కొలువుదీరిన వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు గురువారం నుంచి నిర్వహించనున్నట్టు ఆలయం కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్తీక బహుళ ద్వాదశి శనివారం వరకు శ్రీవారి సన్నిధిలో త్రయాహ్నిక దీక్షతో పాంచరాత్ర దివ్య ఆగమ విధానంలో ఉత్సవాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. బహుళ ఏకాదశి శుక్రవారం సామూహికంగా శ్రీసత్యనారాయణ స్వామి వ్రత మహోత్సవం చేస్తామన్నారు. 7న ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, ప్రాతఃకాలార్చన, బాలభోగం, మంగళశాసనం, తీర్థ ప్రసాద గోష్ఠి నిర్వహిస్తామని తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, మత్స్యాంగ్రహణం, అగ్నిప్రతిష్ఠ, అంకురార్పణ, ధ్వజారోహణం, చక్రబ్దమండల రచన, మంగళశాసనం, సాయంత్రం 6గంటలకు మండపారాధన, మండలార్చన, పవిత్రాధివాసం, విశేష హోమాలు, బలిహరణ, తీర్థ గోష్ఠి నిర్వహిస్తామని ఈవో పేర్కొన్నారు.

జోన్-5లో షాపులకు 22న బహిరంగ వేలం

కంచరపాలెం: జీవీఎంసీ జ్ఞానాపురం జోన్-5 పరిధిలోని 40వ వార్డు నుంచి 63వ వార్డు వరకు గల 24 వార్డులకు సంబంధించిన ఖాళీగా ఉన్న దుకాణాలు, కల్యాణ మండపాలు, రోడ్డు పక్కన మార్కెట్లకు ఈ నెల 22న శుక్రవారం ఉదయం 10 గంటలకు జ్ఞానాపురం జోనల్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 60వ వార్డు గుల్లలపాలెం షాపింగ్ కాంప్లెక్స్‌లో 8, 15, 41, 46, 48, 52, 55, 56, 57, 58 నంబర్ల దుకాణాలు, సుబ్బలక్ష్మినగర్ షాపింగ్ కాంప్లెక్స్‌లో 3, 9, 13, 14 నంబర్ల షాపులు, సంజీవయ్య కాలనీ షాపింగ్ కాంప్లెక్స్‌లో 1, 2 షాపులు, ములగాడ షాపింగ్ కాంప్లెక్స్‌లో 2, 4, అశోక్‌నగర్ షాపింగ్ కాంప్లెక్స్‌లో 1, 2 నంబర్ల షాపులకు మూడేళ్ల కాల పరిమితి, జీవీఎంసీ 51వ వార్డు మాధవస్వామి కల్యాణ మండపానికి మూడు సంవత్సరాలు, జనతా కాలనీ, కంచరపాలెం, తాటిచెట్లపాలెం, అక్కయ్యపాలెం రోడ్ పక్కన మార్కెట్లకు ఒక సంవత్సరం కాల పరిమితితో వేలం పాట నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

10న విజిల్ బ్లోయర్ చిత్ర ప్రదర్శన

సీతంపేట: ప్రపంచ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మానవ హక్కుల అంశంపై రూపొందించిన 'విజిల్ బ్లోయర్'ఆంగ్ల చిత్రాన్ని ఈ నెల 10వ తేదీ ఆదివారం సాయంత్రం 6 గంటలకు ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ప్రదర్శించనున్నట్టు వైజాగ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. ఈ సినిమా తిలకించడానికి ఉచిత ప్రవేశం కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

విశాఖ విద్య: ఎన్ఏడీ సెంటర్‌లోని బుచ్చిరాజుపాలెం, అంబేడ్కర్ నగర్ అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ డి. వెంకటేశ్వరి మంగళవారం తనిఖీ చేశారు. కేంద్రాలకు సరఫరా అయిన సరుకుల వివరాలను అడిగి తెసుకున్నారు. రికార్డుల ప్రకారం స్టాక్ ఉన్నాయా లేదా అని పరిశీలించారు. కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచాలని, నమోదైన వారందరికీ పౌష్టికాహారం అందించేలా శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఆమె వెంట అర్బన్ సీడీపీవో కుమారి, మర్రిపాలెం సెక్టార్ సూపర్ వైజర్ వరలక్ష్మి తదితరులు ఉన్నారు.

ఈవీఎంలపై అవగాహన కల్పిస్తాం


మాట్లాడుతున్న ఆర్డీవో హుస్సేన్ సాహెబ్

విశాఖ విద్య: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈవీఎంల వినియోగంపై ఓటర్లకు అవగాహన కల్పిస్తామని పశ్చిమ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, విశాఖపట్నం ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ అన్నారు. గోపాలపట్నం తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం రాజకీయ పార్టీల నాయకులు, ఎన్నికల విధులు నిర్వహిస్తున్న అన్ని మండలాల అధికారులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఓటర్ల నమోదు ప్రక్రియపై బీఎల్‌వోలంతా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అర్హులైన వారందరికీ తప్పనిసరిగా ఓటు హక్కు కల్పించేలా ప్రజానీకంలో చైతన్యం కల్పించాలని సూచించారు. ఎక్కువ సంఖ్యలో ఒకే వ్యక్తి దరఖాస్తులు సమర్పిస్తే, వాటిని ఎట్టి పరిస్థితుల్లో పరిగణలోకి తీసుకోవద్దని స్పష్టం చేశారు. ఓటర్ల తొలగింపులో కూడా పూర్తి స్థాయిలో పరిశీలన చేయాలన్నారు. సమావేశంలో 8వ జోన్ కమిషనర్ ఎం. మల్లయ్య నాయుడు, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, నియోజకవర్గంలోని అన్ని మండలాల అధికారులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా' పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ వంశీకృష్ణ

బీచ్ రోడ్డు: రాష్ట్రంలో తొలిసారిగా గ్రామ, వార్డు సచివాలయం స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్రా' క్రీడల్లో యువత పాల్గొనాలని ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ కోరారు. మంగళవారం క్రీడా పోటీలకు సంబంధించిన కిట్లను ఆయన కార్యాలయంలో పరిశీలించారు. అనంతరం లోగోను ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు 50 రోజుల పాటు ఈ క్రీడలు కొనసాగనున్నాయన్నారు.